# మంచిమాటలు

కొంతమంది స్త్రీలకు మంచిమాటలు చెప్పి ఇతరులచే పనిపాట్లు చేయించుకోవడం బాగా చేతనవుతుంది. నిజంగా ఇది ఒక కళ అనవచ్చు. అంతమందికీ ఇది చేతకాదు. మామూలుగా ఇంట్లో పనివాళ్ల దగ్గర, పిల్లల దగ్గర దీని ఆవశ్యకత ఎంతేనా వుంటుంది. ఒక్కొక్క ఇల్లాలు ఎంతపెట్టినా కొంచెముపని ఎక్కువ చేయవలసివచ్చేసరికి నావల్ల కాదంటుంది పనిమనిషి. ఎక్కువ పెట్టకపోయినా మంచిమాటలతో వారిని పొంగేసి పనిచేయించుకొంటుదొక గృహిణి. "ఆవిడలా నేను డబ్బు ఇవ్వలేదా? నాకెందుకలా చేయద"ని సాధించి చేయించుకొంటుందింకొక వనిత. కాని ఈ ముగ్గురిలోనూ మంచిగా పనిచేయించుకొనే ఆమెకే మనస్ఫూర్తిగా పనిచేస్తుంది పనిమనిషి. మిగతా వారికి వెట్టికి చేసినట్లే చేస్తుంది.

అందుకనే మన పెద్దలు "మంచిన విషమేనా తాగించవచ్చుకాని, చెడ్డన పాలేనా తాగించలే"మంటారు. ఈ విషయం చిన్న పిల్లల దగ్గర బాగా రుజువవుతుంది. పిల్లలు వుదయము లేచింది లగాయతు రాత్రి నిద్రపోయేదాకా అడుగడుక్కీ పేచీలు పెడ్తూంటారు. కొంతమంది తల్లులు వారికి మంచి మాటలు చెప్పి వారిచేత ఆయా పనులను సక్రమంగా చేయిస్తారు. మరికొంతమంది తల్లులు వారిని పట్టుకొని కొట్టి, తిట్టి వారు ఆ పనులను శ్రద్ధగా చేసేట్టు చూస్తారు. ఇంకొందరు తల్లులు వారు చేయునపుడు శ్రద్ధచూపక తరువాత అవి బాగులేవని వారిని శిక్షిస్తారు. ఈ మూడు రకముల తల్లుల దగ్గర పెరిగిన పిల్లలలో మొదటివారే, అనగా మంచి మాటలతో పనులు చేయించిన తల్లి దగ్గర పెరిగిన పిల్లలే పెద్దవారైనా వారి పనులను సక్రమంగా చేసే అలవాటుకలవాళ్లవుతారు. చిన్నప్పటినుంచీ వారు ఒక క్రమపద్ధతికి అలవాటుపడివుంటారు. అలాకాక భయమువలన చేసిన వారు ఆ భయము పోగానే, అనగా పెద్దవారవగానే ఆ క్రమము విడిచి ఇష్టమువచ్చినట్లు తిరగడానికలవాటుపడుతారు.

పిల్లలు క్రమపద్ధతిలో పెరుగుటకు తల్లులపై ఎంత బాధ్యతవుందో పాఠశాలలో

విద్యాబుద్ధులు నేర్పు గురువులయందు కూడ అంతా వున్నది. ఇది మనము సాధారణముగా చూస్తునే వుంటాము. ఒక్కొక్క మేష్టరు దగ్గర పిల్లలు చాల భయభక్తులతో వుంటారు. ఆ పిల్లలే ఇంకొక మేష్టరు దగ్గర పెంకిగాను, అల్లరిగాను వుంటారు. ఈ అతిచనువుకాని, భయముకాని ఉపాధ్యాయులదగ్గర పిల్లలకి వుండడం అంత మంచిదికాదు. క్రిందటికి ఒక పిల్లాడిని "అంత కష్టపడి ఆ నోట్సు ఎందుకు రాస్తున్నావబ్బాయి" అని అడిగితే "రాయకపోతే మా మేష్టారు తంతారు" అన్నాడు. అదీ వాడి దృష్టిలో నోట్సుకున్న విలువ. అంతేకాని తమకు చదువురావాలని రాస్తున్నానన్న సంగతి ఆ కుఱ్ఱాడు గ్రహించుకోలేదు. అందుచే పిల్లలకు సరియైన విద్యాబుద్ధులు అలవడాలంటే మంచిమాటలచే పనులు చేయించే నేర్పు ప్రతి తల్లికి, ప్రతి వుపాధ్యాయునికీ వుండాలి.

మంచి మాటలంటే జ్ఞాపకము వచ్చింది. మూడేళ్ల క్రిందట కాబోలు నేను టీచరు ట్రయినింగు చదువుచున్న రోజులు. రాజమండ్రిలో బంధువులెవ్వరూ లేకపోవుటచే ఆడపిల్లల హాష్టలులో వుండి చదువుకొంటున్నాను. మా హాష్టలు వార్డెను మహాగడుసు మనిషి. అన్ని సబ్జెక్టులతోపాటు పాకశాస్త్రం కూడా ఒక సబ్జెక్టుగా వుండేది మాకు. ఈ సబ్జెక్టు చెప్పే ఆవిడే మాకు వార్డెనుగా వుండేవారు. ఆవిడ దగ్గర పాకశాస్త్రం కన్న మంచిమాటలచే పనులు చేయించుకోవడమెలాగో నేర్చుకోవాలనిపించింది నాకు. మా అందరితోనూ చాలా సరదాగా మాట్లాడుతూ హాష్టలుకి కావలసిన చిన్న చిన్న పనులు తీరిక సమయములందు మాచే చేయిస్తుండేది. ఒక్కొక్కప్పుడు తనూ మా పనులలో పాల్గొనేది. మా సొమ్మంతా ఖర్చుచేస్తూ తిరిగి మాచేత పనులు చేయించడమా? అని మాలో కొందరికి ఆవిడపై కోపంగా వుండేది. కాని ఆవిడ ముందర జవాబు చెప్పలేకపోయేవాళ్లం.

ఇలా చాలా రోజులు గడచిపోయాయి. ఇక నెల రోజులలో మా ట్రయినింగు పూర్తయి వెళ్లిపోతామనగా ఒక సంఘటన జరిగింది. ఎవరో అధికారులు స్కూలు తణికీకి వచ్చేరు. వారికి మా హాష్టలులో విందు చేతామని నిశ్చయించేము. కాని అవి పెళ్ళిళ్ల రోజులవటముచే వంటలవాళ్లు దొరకలేదు. హాష్టలులో వున్న వంటవానికి స్వీట్సు చేయడం బాగారాదు. సరే ఏదేనా క్లబ్బునుండి తెప్పించుదామనుకున్నాము. కాని మా వార్డెను

అందుకు వప్పుకోలేదు "స్కూలులో పాకశాస్త్రం కూడా ఒక సబ్జెక్టుగా వుంది కాబట్టి మనమే తయారు చేసి వారికి పెట్టినట్లైతే చాలా బాగుంటుంది. అట్టే డబ్బు కూడా ఖర్చు కాదు" అన్నారు. దానితో మాకు ఎక్కడలేని కోపము వచ్చింది. ఇంక ఎలాగూ వెళ్లిపోతూన్నాముకదా అని నిర్భయంగా వ్యతిరేకించేము ఆవిడతో. ఈనాటి విందుకు ఎంత సొమ్మయినా ఖర్చు చేస్తాముకాని, పల్లెత్తు పనైనా ముట్టుకోమన్నాము. వాద వివాదాలు ఎక్కువకాగా, కోపంతో ఆవిడ వెళ్లిపోయింది.

ఆవిడ కోపముతో వెళ్లిపోవడముచేత మాలో మాకు అభిప్రాయ భేదాలొచ్చాయి. ఇన్నాళ్లు మంచిగా వుండి చివరకు ఆవిడకు కోపము తెప్పించడము మంచిదికాదని కొందరు వాదించేరు. మన మీద కోపముచే ఏదేనా చెడ్డ రిమార్క్ రాసేస్తుందేమో అని భయపడ్డాము. మాలో మేము వాదించుకోడం పూర్తయింది. ఆరోజు విందుకి కావలసిని ఏర్పాట్లన్నీ చేయడానికి సిద్ధంగా వున్నామని ఆవిడకు కబురు పెడదామని నిశ్చయించేము. ఇంతలో మా స్కూలు బంట్రోతు ఒక నోటీసు పట్టుకొని వచ్చేడు. అందులో ఈరోజు విందు రద్దుచేయబడ్డాదనీ. మామూలుగా పాకశాస్త్రం ప్రాక్టికల్ క్లాసుకు అందరూ రావలెననీ, అదీకాక ఇన్‌స్పెక్ట్రెస్ వస్తున్నారని రాసివుంది. ఎంతో వుత్సాహంగా విందుకు తయారవబోతూన్న మాకు ఈ వార్త నిజంగా నిరాశ కలిగించిందని చెప్పక తప్పదు.

సరిగ్గా టైముకి ప్రాక్టికల్ హాలులోకి వెళ్లేము అందరమూ. పూర్వపు కోపమంతా పోయి మాతో మామూలుగానే మాట్లాడింది ఆవిడ. ఇంతలో బంట్రోతు ఇంకొక నూతన స్త్రీని రూములో ప్రవేశపెట్టేడు. ఆవిడే మా కొత్త ఇన్స్‌స్పెక్ట్రెస్ అయివుంటుందని మేము వూహించేము. మా వూహ సరియైనదే. ఆమె వచ్చిన వెంటనే మేము చెయ్యవలసిన క్రమమంతా చెప్పి ఆమెను ఇంకొక క్లాసులోనికి తీసుకొని వెళ్లేరు మా టీచరు. అందరము పట్టుదలతో శ్రద్ధగా చేస్తున్నాము. వారు తిరిగి వచ్చేలోగా మేము తయారుచేస్తున్న పదార్థాలు పూర్తికావాలి. ఒక్క అరగంట గడిచింది. రమారమి అన్నీ పూర్తి అయినట్లే. ఇంతలో మా వార్డెను నవ్వు కుంటూ వచ్చి, "ఇంకెందుకమ్మా! ఆ తొందర. ఆవిడ వెళ్లిపోయినారు. అర్జంటుగా ఇంకొక స్కూలుకి వెళ్లాలిట" అన్నారు. "అయ్యో! ఇంతా

కష్టపడి చేసేము. అదీ కాక ఈవిడగారికోసం విందుకూడా రద్దు చేసుకున్నాము" అన్నాం. "అవును నిజమే, అన్నీ చెయ్యనే చేసేరు, ఇవన్నీ వూరకనే పారపోసేకంటే ఆ అధికారులను పిలిచి పెట్టేస్తే సరిపోతుంది. మాటా, మర్యాదాకూడా దక్కుతుంది. మరి మీరేమంటారు? అన్నారు. "సరే" అన్నాము.

విందు యథావిధిగా పూర్తయింది. అధికారులందరూ మా వంటలను చాలా మెచ్చుకున్నారు. తరువాత తెలిసిన భోగట్టా ఏమిటంటే - మా టీచరు ఆ విందు కొరకే ప్రాక్టికల్ పేరుతో మాచేత అవన్నీ చేయించేరుట. ఆ నూతన స్త్రీ ఆమె స్నేహితురాలట. హాస్టలు చూడడానికి వస్తే ఈ నాటకం ఆడారు. ఇప్పటికీ అంటుంటారు "ఈనాటి పిల్లలు తిన్నగా చెప్తే వింటారా! వారికెన్ని డొంకతిరుగుళ్లు పెట్టాలి!" అని.

- జూన్, 1954, గృహలక్ష్మి